## క్లుప్తంగా

### డాక్టర్ జయప్రకాష్‌రెడ్డికి అంతర్జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ జయప్రకాష్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలుకు చెందిన చెవి, ముక్కు, గొంతు వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ బి.జయప్రకాష్‌రెడ్డికి అంతర్జాతీయ పురస్కారం లభించింది. వివరాలను సోమవారం స్థానిక ఎస్ ఆర్ పేటలోని శ్రీ సత్యసాయి ఈఎన్‌టీ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ జయప్రకాష్‌రెడ్డి తెలిపారు. మలేషియా దేశంలోని కౌలాలంపూర్ నగరంలోని కెబాంగ్ సాన్‌లో ఉన్న అంతర్జాతీయ వైద్య విశ్వవిద్యాలయంలో ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ ఎండోస్కోపిక్ సైనస్ సర్జరీ, స్కల్ బేస్ సర్జరీ శిక్షణా శిబిరం నిర్వహించారన్నారు. ఈ శిక్షణ శిబిరానికి పలు దేశాల నుంచి వంద మంది ప్రఖ్యాతిగాంచిన ఈఎన్‌టీ వైద్యులు ప్రతినిధులుగా పాల్గొన్నారని పేర్కొన్నారు. ఇందులో తనను ఉత్తమ శస్త్రచికిత్స నిపుణుడిగా ఎంపిక చేసి ప్రథమ బహుమతి ప్రదానం చేశారని ఆయన తెలిపారు.

### క్లాప్ డ్రైవర్ల ఆందోళన

కర్నూలు (రూరల్): నగరంలోని మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న క్లాప్ డ్రైవర్లు తమ సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఉదయం క్లాప్ ఆటోలు నిలుపు స్థలం దగ్గర సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ దేశాయ్, రామాంజనేయులు మాట్లాడుతూ.. క్లాప్ డ్రైవర్లకు తక్షణమే రెడ్డి ఏజెన్సీ పెండింగ్ జీతాలు చెల్లించాలని, అలాగే ఈఎస్ఐ,పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. దీనిపై మేనేజర్ స్పందించి పది రోజుల్లో పెండింగ్ జీతాలు మంజూరు చేస్తామని, అలాగే తొలగించిన కార్మికులను యాజమాన్యంతో మాట్లాడి విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

### చెన్నకేవశస్వామి ఆలయ అర్చకులను తొలగించాలి

కర్నూలు(సెంట్రల్): కల్లూరు మండలం సల్కాపురం చెన్నకేశవస్వామి ఆలయ అర్చకులను తొలగించాలని ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..పూర్వకాలంలో ఆలయానికి సంబంధించి దీప ధూప నైవేద్యాల కోసం 15 ఎకరాలను కేటాయించారన్నారు. ఆ భూమిని అర్చకులు సాగు చేసుకుని ఆలయ అవసరాలను తీర్చేలా పెద్దలు నిర్ణయించారన్నారు. అయితే, ప్రస్తుతం అర్చకుడిగా ఉన్న కేశవాచారి ఆలయంలో కనీసం దీపం కూడా పెట్టడం లేదన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సెక్రటరీ దేవేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ మద్దిలేటి, ట్రెజరీ యుగంధర్‌గౌడ్ పాల్గొన్నారు.

### 21 నుంచి హజరత్ తాహెర్ గుల్షాన్ దర్గా ఉరుసు



వాల్ పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని చౌక్ బజార్‌లో వెలసిన హజరత్ తాహెర్ గుల్షాన్ దర్గా ఉరుసు ఈ నెల 21వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు దర్గా సజ్జాద్ నషీన్ సయ్యద్ మొహమ్మద్ హుసేన్ పీర్ ఖాద్రీ అన్నారు. సోమవారం స్థానిక పాతబస్తీలోని ఆ దర్గాలో ఉరుసు వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21న గంధం, 22న ఉరుసు, 23న జియారత్ వేడుకలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు సయ్యద్ అత్తర్ పాషా, డాక్టర్ సయ్యద్ తాహెర్ పాషా, అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

### పాత పెన్షన్ కోసం పోరు

కర్నూలు(రాజ్‌విహార్): రైల్వే శాఖ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు పోరాటాలు చేయనున్నట్లు సౌత్ సెంట్రల్ ఎంప్లాయిస్ సంఘ్ హైదరాబాద్ డివిజన్ కార్యదర్శి కేవీఆర్ ప్రసాద్ అన్నారు. సోమవారం రాత్రి స్థానిక సిటీ రైల్వే స్టేషన్‌లో బ్రాంచ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానంతో ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతోందని, ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ నాయకులు మర్రి రాఘవయ్య నేతృత్వంలో ఆందోళనలు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆ సంఘం కర్నూలు శాఖ కార్యదర్శి మున్నోజీరావు, స్టేషన్ మేనేజరు నాగేంద్ర, నాయకులు ప్రమీణ్‌కుమార్ పాల్గొన్నారు.

### పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ఆందోళన

కర్నూలు(సెంట్రల్): కోసిగి, కోడుమూరు మండలాల్లో పనిచేసే స్వచ్ఛ భారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప కోరారు. సోమవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్ యాదవ్, గోపాల్, చంద్రశేఖర్, టి.రామాంజనేయులు పాల్గొన్నారు.

# చౌడేశ్వరీ..చల్లగా చూడు

నగరంలో ఘనంగా అమ్మవారి జయంత్యుత్సవం



ప్రత్యేక అలంకారంలో చౌడేశ్వరీ మాత



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: నగరంలో చౌడేశ్వరీమాత జయంత్యుత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ప్రతి ఏటా ఆషాఢమాస అమావాస్యను పురస్కరించుకుని సోవారం ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీ. స్థానిక సప్తగిరి నగర్‌లోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలో ఉన్న చౌడేశ్వరీ దేవికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అభిషేకం, జ్యోతి ఉత్సవాలు, బోనాల ప్రదర్శనలు, శ్రీ లలితా సహస్రనామ కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

**భక్తి శ్రద్ధలతో పురుష సూక్త పూజలు**

కర్ణాటక సంక్రమణం దక్షిణాయన పర్వకాలాన్ని పురస్కరించుకుని స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం సవితృ సూర్యనారాయణ స్వామి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యనారాయణ మూర్తికి పురుష సూక్త విధానంతో అరుణ పారాయణం, క్షీరాభిషేకం రుద్ర పారాయణం, సుగంధ జలాభిషేకం పూజలు జరిగాయి. అలాగే స్వామి ఆలయంలోని కార్య సిద్ధి ఆంజనేయ స్వామికి అభిషేకం, సింధూర అర్చన, ఆకు పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

## చెంతకే పింఛన్



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి పెన్షన్ ఇస్తున్న వలంటీర్ గంగాదేవి

వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న ఈ యువతి పేరు ఎస్. గంగాదేవి. ఇంటర్ వరకు చదువుకున్న ఈ యువతికి సేవ చేయాలనే ఆసక్తి ఎక్కువ. దీంతో 2020లో వలంటీర్‌గా చేరి నగరంలోని 19 వ వార్డు 48 వ సచివాలయంలో పనిచేస్తుంది. మూడు ఏళ్ల నుంచి తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతగా నిర్వహిస్తోంది. గణేష్ నగర్‌లో 100 కుటుంబాలకు అవసరమైన సేవలు అందిస్తోంది. ప్రభుత్వ పథకాల గురించి తెలియజేస్తూ అర్హులతో వాటికి దరఖాస్తు చేయిస్తోంది. ప్రతినెల ఒకటో తేదీ ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్లకు సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తోంది. ఎవరైనా ఆరోగ్యం బాగా లేక ఆసుపత్రుల్లో ఉంటే అక్కడికి వెళ్లి ఇస్తుంది. కరోనా సమయంలో గంగాదేవి ప్రాణాలను లెక్క చేయకుండా అందించిన సేవలను కాలనీవాసులు నేటికి గుర్తు చేసుకుంటున్నారు. -కర్నూలు (టౌన్)

### గతంలో ఎప్పుడూ చూడలేదు



నేను గత ఆఖరులో ఆరోగ్యం బాగాలేక కల్లూరు చెన్నమ్మ సర్కిల్ సమీపంలోని శ్రీ చక్ర ఆసుపత్రిలో చేరాను. వారం రోజులు అక్కడే ఉన్నా. ఈ విషయం వలంటీర్‌కు తెలియదు. ఈసారి వృద్ధాప్య పింఛన్ ఇస్తారో లేదో అనుకున్నా. 1 వ తేదీ మా వార్డు వలంటీర్ గంగాదేవి వచ్చి ఆప్యాయంగా పలకరించి చేతిలో పెన్షన్ మొత్తం పెట్టింది. ఇలా గతంలో ఎక్కడాచూడలేదు. పెన్షన్ కోసం కార్యాలయాల వద్ద గంటల తరబడి ఎదురు చూసే వాళ్లం. ఇప్పుడు మేము ఎక్కడ ఉంటే అక్కడికే వచ్చి వలంటీర్లు పింఛన్ ఇవ్వడం సంతోషంగా ఉంది.

– కుమ్మరి లక్ష్మమ్మ, గణేష్ నగర్

# అర్జీల పరిష్కారంలో అలసత్వాన్ని వీడాలి

● జేసీ నారపురెడ్డి మౌర్య



స్పందనలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): అధికారులు అలసత్వాన్ని వీడి జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీలకు సత్వరమే పరిష్కారాలు చూపాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. స్పందన కార్యక్రమాన్ని అధికారులు అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు.అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారాలు చూపించాలన్నారు. అర్జీలు ఎట్టి పరిస్థితుల్లోనూ రీ ఓపెన్ కాకూడదని సూచించారు. కాల పరిమితి లోగా దరఖాస్తులన్నింటినీ పరిష్కరించాలన్నారు.

**'స్పందన'కు వచ్చిన కొన్ని వినతులు**

- గూడూరు మండలం మల్లాపురం గ్రామ పొలిమేరలో తనకు 2.94 ఎకరాల భూమి ఉన్నదని, దానిని వేరేవారు ఆక్రమించుకొని అనుభవిస్తున్నారని, సర్వే చేసి తన భూమిని తనకు ఇప్పించాలని సిబెళగల్ మండలం కొత్తకోటకు చెందిన బి.శివనాగయ్య అర్జీ ఇచ్చారు.
- తాను ఎక్స్ సర్వీసు మెన్ అయినందున 2008లో రాష్ట్ర ప్రభుత్వం 5 ఎకరాల భూమిని ఇచ్చిందని, అయితే దానిని ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా తహసీల్దార్ డిజిటల్ సైన్‌ను తీసి వేశారని, అప్‌లోడ్ చేయించాలని ఓర్వకల్లు మండలం పూడిచెర్లకు చెందిన అహ్మద్ హుస్సేన్ సాహెబ్ అధికారులను కోరారు.
- పిల్లల సమస్యలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్న ఓర్వకల్లు సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల వసతి గృహాల వార్డెన్ ప్రమీల, ఏఎస్‌డబ్ల్యూఓలను సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.సోమన్న, ఈ.శ్రీరాములు గౌడ్ వినతిపత్రం ఇచ్చారు.
- ఆన్‌లైన్ బెట్టింగ్, లివింగ్, ఫ్రెండ్‌షిప్‌ల పేరుతో ఉన్న యాప్‌లను నిషేధించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి వినతిపత్రం ఇచ్చారు.

# ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు

కర్నూలు(రాజ్‌విహార్): గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా నెరవేర్చారని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 2019 నుంచి ప్రభుత్వ పథకాల ఫలాలను గడప వద్దకే తెచ్చి ఇస్తున్నామన్నారు. సోమవారం రాత్రి ఆయన స్థానిక 12వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వడ్డెగేరి, కేవీఆర్ గార్డెన్ ఏరియాల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వైఎస్ఆర్ సీపీ నాలుగేళ్ల పాలనలో వారికి చేకూరిన లబ్ధి గురించి వివరించారు. ఇంటి యజమానులకు సంక్షేమ క్యాలెండర్ అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో పథకాల లబ్ధి కోసం ప్రజలు ప్రభుత్వం కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగేవారన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. వలంటీర్ల ద్వారా నేరుగా ఇంటి వద్దకే పథకాలు వస్తున్నాయన్నారు. నేరుగా లబ్ధిదారులకే ప్రభుత్వ సాయం అందుతుందన్నారు. ఇంతటి గొప్ప వ్యవస్థను తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో అండగా నిలబడాలని ప్రజలను కోరారు.

**పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి**

వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. సోమవారం రాత్రి ఆయన స్థానిక తన కార్యాలయంలో కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, బూత్ లెవెల్ కమిటీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తున్న సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రతి కార్యకర్త ఇప్పటి నుంచే పార్టీ గెలుపునకు శ్రమించాలని పిలుపునిచ్చారు.

## క్రైం కార్నర్

### మందుబాబులకు జైలుశిక్ష

కర్నూలు: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన పది మందికి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ కర్నూలు స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి రత్నం తీర్పు చెప్పారు. కర్నూలు అర్బన్ తాలూకా సీఐ శ్రీరామ్ ఆధ్వర్యంలో కర్నూలు మండలం పంచలింగాల చెక్‌పోస్టు దగ్గర ఆదివారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. తెలంగాణలో మద్యం తాగి 44వ నంబర్ జాతీయ రహదారిపై వాహనాలపై వెళ్తున్న కర్నూలుకు చెందిన చంద్రశేఖర్, ఇందిరాగాంధీ నగర్‌కు చెందిన మధుసూదన్, మాసామసీదుకు చెందిన వెంకటేశ్వర్లు, కొత్తూరు గ్రామానికి చెందిన నాగేశం, పంచలింగాల గ్రామానికి చెందిన రఫిక్ బాషా, ఎస్ఆర్ పేటకు చెందిన మురళీగౌడ్, గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన బాలచంద్రుడు, లేబర్ కాలనీకి చెందిన శివుడు, జంపాలశివయ్య నగర్‌కు చెందిన శివన్న, కల్లూరుకు చెందిన కేశవయ్య గౌడ్, సోమిశెట్టి నగర్‌కు చెందిన లక్ష్మన్న తదితరులను అదుపులోకి తీసుకుని వారి వాహనాలను సీజ్ చేసి సోమవారం కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్లు సీఐ శ్రీరాం తెలిపారు.

### సారా విక్రేతల అరెస్టు

కర్నూలు : నగర పరిధిలోని జొహరాపురంలో సారా విక్రయిస్తున్న ఇరువురిని ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. హబీబుల్లా, షాహిద్ బాషాలను అదుపులోకి తీసుకుని ఒక్కొక్కరి వద్ద మూడు లీటర్ల నాటుసారాను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి ఇరువురిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు పోలీసులు తెలిపారు.

# టీచర్ నిత్య విద్యార్థిగా ఉండాలి

కర్నూలు(సిటీ): టీచర్ ఎప్పుడూ నిత్య విద్యార్థిగా ఉండాలని పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్ (సర్వీసెస్) మువ్వా రామలింగం అన్నారు. సోమవారం జిల్లాలోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్, అశోక డిగ్రీ కాలేజీలో జరుగుతున్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ) శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ శిక్షణ తరగతుల్లో ఆయన ప్రసంగించారు. అత్యవసరంగా జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో ఒక్క సబ్జెక్టు టీచర్ కొరత లేకుండా పదోన్నతులు కలిపించామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తోందన్నారు. ఉపాధ్యాయుల హాజరు కోసం 2016-17 లో బయోమెట్రిక్ హాజరును తీసుకువస్తే కొందరు బయోమెట్రిక్ మిషన్‌ను ఉద్దేశపూర్వకంగా పాడు చేయడంతో ఫేషియల్ అటెండెన్స్ యాప్‌ను తీసుకురావడం జరిగిందన్నారు. ప్రతి ఒక్క టీచర్ బాధ్యతగా స్కూల్‌కు హాజరై విద్యార్థులకు చదువు చెప్పాలని సూచించారు. శిక్షణ తరగతుల్లో డీఈఓ ఆఫీస్ ఏడీ శామ్యూల్ పాల్, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు వ్యాక్సిన్ వేయాలి

ఇంద్ర ధనస్సు కార్యక్రమంపై శిక్షణలో డీఎంహెచ్‌ఓ

కర్నూలు(హాస్పిటల్): ఇంద్ర ధనస్సు కార్యక్రమంలో ఇంటింటి సర్వే నిర్వహించి చిన్నారులకు వ్యాక్సినేషన్ చేయించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో యూపీహెచ్‌సీ వైద్యాధికారులకు ఇంద్ర ధనస్సు కార్యక్రమంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామగిడ్డయ్య మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు, ఆశాల ద్వారా గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించాలని, ఐదేళ్లలోపు పిల్లలు వారీగా రెగ్యులర్ వ్యాక్సిన్ మిస్ అయిన వారిని గుర్తించాలన్నారు. టీకాలు వేయని, పాక్షికంగా టీకాలు వేయించుకున్న పిల్లలందరినీ గుర్తించాలన్నారు. ఇలాంటి వారికి ఈ నెల 25వ తేదీలోగా వ్యాక్సినేషన్ చేయించాలన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రామ్‌లో గర్భిణిలు, బాలింతలు, చిన్నపిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారికి రక్తహీనత పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందజేయాలని చెప్పారు. కార్యక్రమంలో డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ భవాని, డీఐఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డీపీఎంఓ డాక్టర్ ఉమా, ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ హేమలత, ఎన్‌హెచ్ఎం డీపీఓ విజయరాజు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**మారుతి నగర్‌లో సీసీ రోడ్డు వేయాలి**

కర్నూల్ (రూరల్): నగరంలోని 19 వార్డులోని మారుతి నగర్‌లో సీసీ రోడ్డు వేయాలని సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, జగన్నాథం డిమాండ్ చేశారు. వార్డులోని సమస్యలు పరిష్కరించాలని సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కమిషనర్‌కు కాలనీ వాసులతో కలసి వినతి పత్రం అందజేశారు.

**డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయండి**

కర్నూలు (టౌన్) : నగరంలోని నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని నాగరాజు అనే కాలనీ వాసి విన్నవించారు. అలాగే కాలనీలో మంచినీటి ట్యాంకు, కమ్యూనిటీ హాలు, గ్రంథాలయం ఏర్పాటు చేయాలన్నారు. సోమవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ భార్గవ్‌తేజ పాల్గొని అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎస్ఈ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

**20, 21 తేదీల్లో వీఆర్‌ఏల దీక్ష**

కర్నూలు(సెంట్రల్): సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20,21 తేదీల్లో అన్ని మండల కేంద్రాల్లో వీఆర్‌ఏలు దీక్షలు చేపడుతున్నట్లు వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తలారి అంజి, శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఏఓ వెంకటేష్‌ను కలిసి వారు వినతిపత్రం ఇచ్చారు.

**10 వేల కోట్లు కేటాయించాలి.**

కర్నూలు(రూరల్): జిల్లా సమగ్రాభివృద్ధికి 10 వేల కోట్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలో నాలుగో రోజు పాదయాత్ర 23, 24 వార్డుల్లో సుంకన్న, లీలావతి ఆధ్వర్యంలో శ్రీరామ నగర్, లక్ష్మి నగర్,జేఎస్ఆర్ నగర్, పాలకొట్టాల వరకు కొనసాగింది. సీపీఎం నగర కార్యదర్శి రాముడు, నాయకులు చలపతి,సుధాకరప్ప,నరసింహులు, సాయిబాబా, హుస్సేన్, నళిని, ఉమాదేవి పాల్గొన్నారు.

**మహా పాదయాత్రను జయప్రదం చేయండి**

కర్నూలు(రూరల్): జిల్లా సమగ్రాభివృద్ధికి 10 వేల కోట్లు కేటాయించాలని ఈ నెల 26 నుంచి 31 తేదీ వరకు సీపీఎం ఆధ్వర్యంలో చేపడుతున్న మహా పాదయాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, అంజిబాబు కోరారు. నగరంలోని కేకే భవన్‌లో రవాణా రంగ కార్మికుల జిల్లా కమిటీ సమావేశం జరిగింది.

**కార్మికులను రెగ్యులర్ చేయాలి**

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగర పాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులను రెగులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్. మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులకు టైం స్కేల్‌ను వర్తింపజేసి పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు చంద్రశేఖర్, మద్దిలేటి, రామాంజనేయులు, సాయిలు, సవారి, నాగేషులు పాల్గొన్నారు.

# భూములు సాగు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): పెద్దకడబూరు మండలం కల్లుకుంటలోని అసైన్‌మెంట్ భూములను సాగు చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని, ఇరువర్గాల ఘర్షణ పేరుతో విధించిన 145 సెక్షన్‌ను నిలిపి వేయాలని సీపీఐ జిల్లాసహాయ కార్యదర్శి ఎస్. మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో కల్లుకుంట రైతులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆ గ్రామానికి చెందిన 100 ఎకరాల భూస్వామి గ్రామంలోని 13 ఎకరాల అసైన్‌మెంట్ భూములకు పట్టాలు పుట్టించుకున్నారన్నారు. ఆ పట్టాలు చెల్లవని తహసీల్దార్ తేల్చారన్నారు. ఆ భూముల్లో సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌యాదవ్, పెద్దకడబూరు మండల కార్యదర్శి వీరేష్‌పాల్గొన్నారు.

**ఈ రోజు** రైతుబజార్‌లో సబ్సిడీపై టమాట పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): వినియోగదారులకు టమాట ధరల నుంచి ఊరట కల్పించేందుకు మంగళవారం కర్నూలు నగరంలోని సి.క్యాంప్, కొత్తపేట, అమీన్ అబ్బాస్ నగర్ రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సబ్సిడీపై పంపిణీ చేయనున్నారు. కిలో రూ. 50 ప్రకారం పంపిణీ చేస్తామని మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు నారాయణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**న్యాయవాదుల విధుల బహిష్కరణ**

కర్నూలు(లీగల్) : అవనిగడ్డ బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది బి.శ్రీనివాసరావుపై జరిగిన దాడికి నిరసనగా మంగళవారం కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం తమ విధులను బహిష్కరించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.నాగభూషణం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎం.వి.చక్రపాణి తెలిపారు. రాష్ట్రంలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

**ఉచిత వైద్యశిబిరం**

కర్నూలు: న్యాయవాదులకు, న్యాయమూర్తులకు, న్యాయశాఖ సిబ్బందికి మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బీపీ, షుగర్, ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహిస్తారని, న్యాయవాదులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


**పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు**


కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు టౌన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బళ్లారి చౌరాస్తా సమీపంలో విద్యుత్ లైను మార్చుతున్న కారణంగా గోపీ నగర్, కృష్ణారెడ్డి నగర్, గురు రాఘవేంద్ర నగర్, నిర్మల్ నగర్, గీత నగర్, జంగాల కొట్టాలు తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

### హత్యాయత్నం అమానుషం

కర్నూలు(లీగల్) : కృష్ణా జిల్లా న్యాయవాది బి.శ్రీనివాసరావుపై జరిగిన హత్యాయత్నాన్ని భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రంగనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికాంత్, కోశాధికారి పి.దస్తగిరి పేర్కొన్నారు. రోజురోజుకు న్యాయవాదులపై దా డులు పెరుగుతున్నాయని, ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టం రూపొందించాలని వారు డిమాండ్ చేశారు.








## అడుగడుగునా చెత్త!

నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో అడుగడుగునా చెత్త దర్శనమిస్తోంది. ఆసుపత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అధికారుల పర్యవేక్షణ లోపానికి ఈ చెత్త అద్దం పడుతోంది. మరీ ముఖ్యంగా డీఎం అండ్ హెచ్ఓ కార్యాలయం ఎదుటే బ్యాగుల కొద్దీ చెత్త పేరుకుపోయినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. అసలే వ్యాధుల కాలం కావడం.. అడపాదడపా వర్షం కురుస్తుండటంతో ఈ ప్రాంతం దుర్వాసన వెదజల్లుతోంది. ఇక్కడ మాత్రమే కాదు.. ఆసుపత్రిలో ఏ మూల చూసినా నల్లటి చెత్త బ్యాగులే దర్శనమిస్తుండటం గమనార్హం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు